నమస్తే తెలంగాణ

కరీంనగర్

5 | కరీంనగర్, శనివారం 7 జూన్ 2025 | KARIMNAGAR



## 10న ఉద్యోగ మేళా



కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జూన్ 6 : జిల్లాలోని నిరుద్యోగ యువకులకు హైదరాబాద్‌లోని వీవీసీ మోటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 10న కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డలో గల ప్రభుత్వ ఈ-సేవ కేంద్రం పై అంతస్తులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీవీసీ మోటర్స్‌లో ఈవీ సర్వీస్ టెక్నీషియన్, ఆటోమోటీవ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటికి పదో తరగతి, ఐటీఐ, డిప్లొమో, ఏదైనా డిగ్రీ చదివిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వీరికి 18 ఏళ్ల నుంచి 30లోపు ఉండాలని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. వివరాల కోసం 72076 59969, 77299 92061, 92462 60743 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### సమ్మయ్యకు 40 క్వింటాళ్లు

ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌లోని రైతు నాంసాని సమ్మయ్య ఎనిమిది ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశాడు. ప్రస్తుతం రెండెకరాల తోట కోతకు వచ్చింది. శుక్రవారం గెలలను కోయగా, 4 టన్నులు (40 క్వింటాళ్లు) దిగుబడి వచ్చింది. టన్నుకు ₹21వేల చొప్పున ₹84వేల ఆదాయం వచ్చింది.



### ఈ గొప్ప ఆలోచన కేసీఆర్ సార్‌దే..

మమ్మల్ని ధనవంతులను చేయాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మాతో ఆయిల్‌పామ్ సాగు చేయించిండు. ఈ గొప్ప ఆలోచన ఆ సార్‌దే. రైతుల కోసం 24 గంటల కరెంటు, కాళేశ్వరం ప్రాజెక్టు, రైతుబీమా, రైతుబంధు వంటి పథకాలు అందించి రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నడు. ఆయిల్‌పామ్ సాగు చేస్తే రైతులం ఇంకా అభివృద్ధి చెందే అవకాశం ఉందని ఆలోచన చేసిండు. ముందుగా మా మండలంల ఆయిల్‌పామ్ సాగుకు అధికారులు వచ్చినప్పుడు కేసీఆర్ సార్‌పై నమ్మకంతో మూడేళ్ల కిందట రెండెకరాల్లో సాగు చేసిన. పంట గురించి తెలుసుకొని రెండేళ్ల కిందట మరో ఆరెకరాల్లో సాగు చేసిన. మొదట సాగుచేసిన రెండెకరాల్లో పంట కోతకు వచ్చింది. మొదట పంట పెట్టినప్పుడు టన్నుకు ₹12 వేలు ఉంటే అదే చాలనుకున్నం కానీ, ఇప్పుడు టన్నుకు ₹21 వేలు ఉంది. ఈ పంట పెట్టినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది.

**- నాంసాని సమ్మయ్య, రైతు (అడవిశ్రీరాంపూర్)**

**సాకారమైన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కల**



# చేతికొచ్చిన ఆయిల్‌పామ్

- ఐదేళ్ల కింద ఆయిల్‌పామ్ సాగుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రోత్సాహం
- పెద్ద ఎత్తున సాగు చేసిన రైతాంగం
- కోతకు వచ్చిన తోటలు.. మొదటి క్రాప్ కోత మొదలు
- కేసీఆర్ చొరవే అంటున్న రైతులు



రైతు రాంరెడ్డి సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలో గెలలను పరిశీలిస్తున్న ఉద్యాన వన శాఖ అధికారులు



### మూడేళ్లకే కోతకు వచ్చింది

ఆయిల్‌పామ్ మూడేళ్లకే కోతకు వచ్చింది. ఇప్పుడే ఆదాయం మొదలైంది. నేను తొలుత రెండెకరాలు, ఆ తర్వాత ఎకరన్నర సాగు చేసిన. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రోత్సాహంతోనే తోట వేసిన. చెట్లు మంచి గెలలు వేసినయ్. తొలిసారి టన్నున్నర దిగుబడి వచ్చింది. ₹33 వేల ఆదాయం రావడం ఆనందంగా ఉంది.

**- బద్ధం రాంరెడ్డి, రైతు, నర్సింగాపూర్ (ధర్మారం)**

### రాంరెడ్డికి 15 క్వింటాళ్ల దిగుబడి

ధర్మారం మండలం నర్సింగాపూర్‌కు చెందిన బద్ధం రాంరెడ్డి మూడున్నర ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయగా, మూడేళ్ల నాలుగు నెలలకే తొలి ఫలితం వచ్చింది. తోటంతా గెలలతో కళకళలాడుతున్నది. ఈ గెలలను కోయగా టన్నున్నర దిగుబడి (15 క్వింటాళ్లు) వచ్చింది. ఒక టన్నుకు (10 క్వింటాళ్లు) ₹22వేల ధర కాగా, టన్నున్నరకు ₹33 వేల ఆదాయం సమకూరింది. ఈ గెలలను తిరుమల ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేయడానికి వచ్చారు. ఆయిల్ పామ్ తోటలు సాగుచేసిన చుట్టుపక్కల గ్రామాల రైతులను ఆహ్వానించారు. రాంరెడ్డి తోటలోని గెలలను చూపించారు. ఆ రైతుల ఎదుటనే గెలలను అధికారులు కోయించారు. అక్కడే తూకం వేసి టన్నున్నర దిగుబడి వచ్చిందని ధ్రువీకరించారు.



క్రాపు కోసి ఆయిల్‌ఫెడ్‌కు తరలిస్తూ..

**తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కన్న కలలు నెరవేరుతున్నాయి. సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి వాణిజ్య పంటలవైపు మళ్లించి, రైతులు లాభాలు గడించేలా ఆయన తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. రాష్ట్రంతోపాటు దేశానికి పామాయిల్ కొరతను తీర్చడానికి నాలుగేళ్ల కిందట రైతులను సన్నద్ధం చేసి, రాయితీ అందించి రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయించగా, ఇప్పుడు పంట చేతికందుతున్నది. తొలి పంట కోతకు రావడం, ధర కూడా బాగుండడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.**

పెద్దపల్లి, జూన్ 6(నమస్తే తెలంగాణ)/ ధర్మారం/ కాల్వశ్రీరాంపూర్/ ముత్తారం : రైతుల అభ్యున్నతే లక్ష్యంగా నాడు బీఆర్‌ఎస్ సర్కారు లాభదాయకపంటల వైపు మళ్లించింది. రాయితీతో ఆయిల్‌పామ్ సాగువైపు ప్రోత్సహించింది. దాంతో ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంట వేయగా.. ప్రస్తుతం చేతికి వస్తున్నది. ఒక్క పెద్దపల్లి జిల్లాలో మూడు వేల ఎకరాల్లో 1100 మంది రైతులు సాగు చేయగా, నాలుగో ఏట నుంచి అంటే ఇప్పుడు కోత మొదలైంది. శుక్రవారం తొలి క్రాప్ కటింగ్ అయింది. ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామంలో నాంసాని సమ్మయ్య, కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన పత్తి శ్రీనివాస్ రెడ్డి, ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామంలో బద్ధం రాంరెడ్డి మొదటిసారిగా క్రాప్‌ను కట్ చేశారు. ముత్తారం మండల రైతు సమ్మయ్యను జడ్పీ మాజీ చైర్మన్, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సన్మానించగా.. అడవిశ్రీరాంపూర్ మండల రైతు దంపతులను కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా ఉద్యానవనాధికారి జగన్‌మోహన్‌రెడ్డి సన్మానించారు. అయితే, నాలుగేళ్ల తర్వాత క్రాప్ రావడంతో కోసిన గెలలను ఆయిల్ ఫెడ్ కంపెనీకి అప్పగించారు. క్రాప్ కంటింగ్ ఏడాది పొడవునా పదిసార్లు చేయనున్నారు. అదే విధంగా రైతులు మరో 25 నుంచి 30 ఏండ్ల వరకు ఎలాంటి పెట్టుబడి పెట్టకుండానే ఏడాదికి పది సార్లు ఆదాయాన్ని పొందనున్నారు. క్రాప్ కటింగ్‌కు రావడం ప్రారంభం కావడంతో ఆయిల్‌పామ్ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్ నాటికి జిల్లాలోని మొత్తం 1100 మంది రైతులకు చెందిన 3 వేల ఎకరాల పంట సైతం కోతకు రానున్నది. తొలి క్రాప్‌గా ₹15 వేల నుంచి ₹20 వేల వరకు ఆదాయం రానుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. తమ ఆదాయానికి, ఈ పంటల సాగుకు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కారణమని, ఆయన నిర్విరామ కృషి ఫలితంగానే నేడు తాము ఆదాయాన్ని పొందబోతున్నామని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### అన్నింటికంటే ఆయిల్‌పామ్ బాగుంది



మాకు ఆదాయం రావడం మొదలైంది. 25 ఏండ్ల నుంచి 30 ఏండ్ల దాకా ఆదాయం ఉంటుంది. గ్రామ శివారుల నేను రెండున్నర ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేసిన. 2022 జనవరి 24న 150 మొక్కలు నాటిన. అవిప్పుడు ఏపుగా పెరిగి గెలలు కోతకు వచ్చినయ్. ఈరోజు సుమారు 2.50 టన్నుల గెలలు కోసి అశ్వరావుపేట ఆయిల్ ఫ్యాక్టరీకి తరలించినం. ఇప్పుడు టన్ను ధర ₹18 వేల పైనే ఉందని అధికారులు చెప్పిన్రు. అన్ని పంటల కంటే ఈ పంట చాలా బాగుంది. మంచి ఆదాయం వస్తుందనే నమ్మకం ఉంది. కేసీఆర్ గొప్ప ఆలోచనతో ఈ పంట పండించాలని చెప్పి చేయించిండు. మా ఆదాయానికి కేసీఆరే కారణం.

**- పత్తి శ్రీనివాస్‌రెడ్డి, పెగడపల్లి (కాల్వశ్రీరాంపూర్ మండలం)**



పెగడపల్లిలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి గెలలు తీసుకెళ్తున్న పత్తి శ్రీనివాస్‌రెడ్డి వాహనానికి జెండా ఊపుతున్న కలెక్టర్ శ్రీహర్ష

### శ్రీనివాస్‌రెడ్డికి 25 క్వింటాళ్లు

కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లికి చెందిన పత్తి శ్రీనివాస్‌రెడ్డి 2022 జనవరిలో రెండున్నర ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేశాడు. ప్రస్తుతం తోట కోతకు రావడంతో సంతోషపడ్డాడు. శుక్రవారం గెలలను కటింగ్ చేయించాడు. రెండున్నర టన్నులు (25 క్వింటాళ్లు) దిగుబడి రాగా, టన్నుకు ₹18,500 చొప్పున ₹45 ఆదాయం వచ్చింది. గెలలను కోసిన తర్వాత కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలో ఉన్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి తరలివెళ్తున్న వాహనానికి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగుతో అనేక లాభాలు ఉన్నాయని, రైతులు ముందుకు రావాలని సూచించారు. అనంతరం అక్కడే ఆయిల్‌పామ్ మొక్క నాటి, శ్రీనివాస్ రెడ్డి దంపతులను శాలువాతో సత్కరించారు.



ఆయిల్‌పామ్ గెలలు



రాంరెడ్డి ఆయిల్ పామ్ తోటలో రైతులు, కంపెనీ ప్రతినిధులు



రైతు నాంసాని సమ్మయ్య తోటలోని ఆయిల్‌పామ్ గెలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

## కేసీఆర్ ప్రతి ఆలోచన రైతుల బాగు కోసమే

- ఆయిల్‌పామ్ ఫలాలతో ఆర్థికాభివృద్ధి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

ముత్తారం, జూన్ 6 : రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రతి ఆలోచన రైతుల బాగు కోసమేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అడవిశ్రీరాంపూర్‌లో నాంసాని సమ్మయ్య అనే రైతు సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలో పంట తొలి దిగుబడిని ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరైన దిగుబడి రాక రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకోవడం చూసి పంట సాగు విధానంలో మార్పు వస్తే బాగుంటుందని కేసీఆర్ గొప్పగా ఆలోచన చేశారని, ఈ క్రమంలో రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారి ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం అందించారని గుర్తు చేశారు. దీనికి నిదర్శనమే అడవిశ్రీరాంపూర్‌కు చెందిన నాంసాని సమ్మయ్య వేసిన ఆయిల్‌పామ్ తోటలో మూడేళ్ల తర్వాత పంట చేతికి రావడమేనన్నారు. ఇది 35 ఏండ్ల వరకు దిగుబడి ఇస్తూనే ఉంటుందని, దీనిని ప్రోత్సహించిన కేసీఆర్ ఆలోచనలు ఎంత గొప్పగా ఉంటాయో, రాష్ట్రాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలని ఆలోచన చేశారో అర్థమవుతుందని చెప్పారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతులు మళ్లీ ఆకాశం వైపు చూసే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కరెంటు, నీళ్లు అందడం లేదని, కనీసం పెట్టుబడి సాయం కూడా ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి సాగు చేసిన పంటను అమ్ముకోవడానికి తంటాలు పడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పోతిపెద్ది కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు జక్కుల ముత్తయ్య, అత్తె చంద్రమౌళి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాడి రవీందర్‌రావు, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు నూనె కుమార్, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్లు పోతుపెద్ది రమణారెడ్డి, గట్టు రమేశ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కురాకుల ఓదెలు, మాజీ సర్పంచ్ ఇల్లందుల అశోక్, బీఆర్‌ఎస్ నాయకులు నరెడ్ల రమేశ్, దాసరి రవీందర్, చిగురు విద్యాసాగర్, దాసరి దామోదర్, తిరుమల ఆయిల్‌పామ్ ప్రతినిధులు విజయ్, రంజిత్ పాల్గొన్నారు.

## 'ఆపరేషన్ కగార్' నిలిపివేయాలి

పెద్దపల్లి టౌన్, జూన్ 6: కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి.. మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ తీశారు. అనంతరం అఖిలపక్షం నాయకులు మాదన కుమారస్వామి, ఈదునూరి నరేశ్, ఎరవెల్లి ముత్యంరావు, తాండ్ర సదానందం మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దండకారణ్యంలోని లక్షల కోట్ల విలువైన ఖనిజ సంపదను బడా కార్పొరేట్ దిగ్గజాలకు అప్పగించడానికి ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఆదివాసీలను అక్కడి నుంచి గెంటివేసేందుకే కుయుక్తులు చేస్తున్నదని మండిపడ్డారు. వందలాది మంది మావోయిస్టులు ఆదివాసీలను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో హత్య చేస్తున్నదని ఆవేదన చెందారు. మావోయిస్టులు ఉన్నారనే ఎర చూపి ఖనిజ సంపదను కొందరికి కట్టబెట్టేలా ప్రయత్నాలు చేస్తున్నదని ఆరోపించారు. శత్రు దేశమైన పాకిస్తాన్‌తో చర్యలు జరిపి కాల్పుల విరమణ చేసిన బీజేపీ ప్రభుత్వానికి.. దేశ పౌరులైన మావోయిస్టులతో చర్చలు జరుపడానికి వచ్చిన ఆటంకాలు ఏంటని ప్రశ్నించారు. కర్రెగుట్ట బూటకపు ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దేశంలో రానున్న రోజుల్లో బీజేపీకి పుట్టగతులు ఉండవని జోస్యం చెప్పారు. నిరసన ర్యాలీలో అఖిలపక్షం, వామపక్ష నాయకులు ఈర్ల నరేశ్, మాదన కుమారస్వామి, ఎరవెల్లి ముత్యంరావు, తాండ్ర సదానందం, కల్లెపల్లి అశోక్, గడ్డం జ్యోతి, జిల్లెల ప్రశాంత్, కన్నెబోయిన కనకరాజు, గాండ్ల మల్లేశం, మోదుంపల్లి శ్రావణ్, బాలసాని రాజయ్య, లెనిన్, తాళ్లపల్లి మల్లయ్య, సుచరిత, క్యాదాసి లింగమూర్తి, కోల్లూరి మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లిలో నిరసన ర్యాలీ తీస్తున్న అఖిలపక్షం నాయకులు



హైదరాబాద్‌లో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

## టీటీడీ ఆలయాన్ని త్వరగా నిర్మించాలి

**చైర్మన్ బీఆర్ నాయుడు కోరిన మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్**

కరీంనగర్, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్మించతలపెట్టిన శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని త్వరగా నిర్మించాలని సదరు దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడును మాజీ ఎంపీ, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో బీఆర్ నాయుడును కలిసి కరీంనగర్‌లో నిర్మించతలపెట్టిన దేవస్థానం గురించి వివరించారు. 2023 మేలో ఆలయ నిర్మాణానికి అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితోపాటు అప్పటి మంత్రి గంగుల కమలాకర్ వేద పండితుల మధ్య వైభవంగా భూమిపూజ చేశారని, ఆ తర్వాత ఆలయ పనులు ముందుకు సాగలేదని చెప్పారు. టీటీడీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో అద్భుతమైన ఆలయాన్ని నిర్మిస్తామని అప్పటి అధికారులు హామీ ఇచ్చారని, అవసరమైన స్థలాన్ని కూడా కేటాయించామన్నారు. ఇక్కడ శ్రీవారి ఆలయాన్ని నిర్మిస్తే అనేక జిల్లాల భక్తులకు కొంగుబంగారంగా మారే అవకాశముందని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన చైర్మన్.. త్వరలో ఆలయ నిర్మాణం పనులు చేపడుతామని వినోద్‌కుమార్‌కు హామీ ఇచ్చారు.

## పథకాలకు లంచాలా..?

- ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువవికాసం కింద అనర్హులను ఎంపిక చేస్తారా..?
- బీఆర్‌ఎస్ శ్రేణుల ఆగ్రహం
- చిగురుమామిడి ఎంపీడీవో కార్యాలయం ముట్టడి
- కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు



ఎంపీడీవో ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చిగురుమామిడి, జూన్ 6: 'పథకాలకు లంచాలు అడుగుతారా..? ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువవికాసం పథకాల కోసం కాంగ్రెస్ నాయకులు అనర్హులను ఎంపిక చేస్తారా?' అని బీఆర్‌ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో అధికారులు సైతం విఫలమయ్యారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ చిగురుమామిడి మండలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరాగా, అధికారులను లోనికి వెళ్లకుండా కార్యాలయం ఎదుట బైఠాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తూ, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాల ఎంపికలో భాగంగా పలువురు కాంగ్రెస్ నాయకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. బొమ్మనపల్లి గ్రామంలో కొమిరె లక్ష్మణ్‌గౌడ్‌కు గుంట భూమి కూడా లేదని.. ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు కోసం ₹50వేలు ఖర్చు అవుతుందని ఓ నాయకుడు తెలిపారన్నారు. అర్హులైన బాధితుడికి ఇల్లు మంజూరుకాలేదన్నారు. ఓ మేజర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సైతం డబ్బుల కోసం డిమాండ్ చేశారని మండిపడ్డారు. ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అనర్హులను ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువవికాసం పథకాలకు ఎంపిక చేశారన్నారు. లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాల్సి ఉండగా, అధికారులు సైతం కాంగ్రెస్ నాయకులకు వత్తాసు పలికారని మండిపడ్డారు. ఇప్పటికైనా అర్హులను ఎంపిక చేయకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో జిల్లా నాయకుడు సాంబారి కొమురయ్య, మండల నాయకులు పెసరి రాజేశం, బేతి రాజిరెడ్డి, రామోజు కృష్ణమాచారి, ఎండీ సర్వర్‌పాషా, సందీప్‌రెడ్డి, జక్కుల రవీందర్, సన్నీల వెంకటేశం, బెజ్జంకి లక్ష్మణ్, బోయిని శ్రీనివాస్, మిట్టపల్లి మల్లేశం, కరివేద మహేందర్‌రెడ్డి, శ్యామకూర సంపత్‌రెడ్డి, గీట్ల తిరుపతిరెడ్డి, బుర్ర తిరుపతి, బోయిని శ్రీనివాస్, కత్తుల రమేశ్, నాగేలి రాజిరెడ్డి, రావుల వెంకన్న, పిల్లి వేణు, నారాయణ, బిల్లా వెంకటరెడ్డి, సన్నీల మల్లేశం, బోయిని రమేశ్, మక్బుల్‌పాషా, శరబందరెడ్డి, కొమురయ్య, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### అనర్హుల ఏరివేత నిరంతర ప్రక్రియ

ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాల కోసం సాధ్యమైనంత వరకు అర్హులను ఎంపిక చేశాం. ఒకవేళ కొన్ని గ్రామాలలో ఎక్కడైనా అనర్హులకు మంజూరైతే ఎరువేతను తొలగించేందుకు అవకాశం ఉన్నది. అనర్హుల ఏరువేత నిరంతర ప్రక్రియగా కొనసాగుతున్నది. మరోసారి గ్రామాల వారీగా అర్హులను పరిశీలిస్తాం.

**- బాషం మధుసూదన్, ఎంపీడీవో (చిగురుమామిడి)**

## అందుబాటులో అన్నిరకాల మెడిసిన్

కీర్తి మెడికల్స్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేశ్ కుమార్, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరేందర్ రెడ్డి



విద్యానగర్, జూన్ 6: కరీంనగర్‌లోని కీర్తి మెడికల్స్‌లో అన్ని రకాల మెడిసిన్ అందుబాటులో ఉంటుందని, ఇలాంటి అవకాశాన్ని కరీంనగర్ ప్రజలు వినియోగించుకోవాలని వక్తలు కోరారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో విజయవంతంగా నడుస్తున్న కీర్తి మెడికల్స్ 25వ బ్రాంచ్‌ను శుక్రవారం కరీంనగర్‌లో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేశ్ కుమార్, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, ఐఎంఏ జిల్లా ప్రెసిడెంట్ ఎనమల్ల నరేశ్ ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కటింగ్ చేశారు. అనంతరం కీర్తి మెడికల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ తిరుపతి రెడ్డి అతిథులకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడారు. కీర్తి మెడికల్స్‌లో 30 వేల రకాల మెడిసిన్స్ అందుబాటులో ఉండడం, 24 గంటలు సర్వీస్ అందిస్తుడడం నగరవాసులకు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. హోల్‌సేల్ ధరలలో అందుబాటులో ఉండడం సంతోషకరమన్నారు.